ప్రజాశక్తి
మంగళవారం మే 14 2024 8 పేజీలు
శ్రీకాకుళం

ఈ ఖరీఫ్‌కైనా నీరందేనా..?

పిచ్చిమొక్కలు, పాదలతో నిండిన వంశధార కాలువలు

(...6లో)

ఎచ్చెర్ల : ఓటు వేసేందుకు బారులు తీరిన ఓటర్లు

సోంపేట : తొలిసారి ఓటుహక్కు వినియోగించుకున్న యువతులు

- జిల్లాలో 74.99 శాతం ఓటింగ్ నమోదు
- రాత్రి 11 గంటల వరకు కొన్నిచోట్ల కొనసాగిన పోలింగ్
- ఉదయం ఏడు గంటల నుంచే బారులు తీరిన ఓటర్లు
- పలుచోట్ల ఇవిఎంల మొరాయింపు
- అక్కడక్కడా ఘర్షణలు
- చెదురుమదురు ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతం
- స్ట్రాంగ్‌రూమ్‌కు ఇవిఎంల తరలింపు
- ఇవిఎంల్లో నేతల భవిత
- వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు

ఓ(పో)టెత్తారు

పోల్ ఫైట్ ముగిసింది. నే'తల రాత'ను శాసించే ఓటరు తీర్పు ఇవిఎంల్లో నిక్షిప్తమైంది. అసెంబ్లీ, పార్లమెంట్‌లో అడుగుపెట్టే లక్ష్యంతో బరిలో నిలిచిన నాయకుల ఆశల మూటలన్నీ స్ట్రాంగ్‌రూమ్‌లకు చేరాయి. ఆ గుట్టు వచ్చే నెల నాలుగో తేదీన విప్పే వరకు అభ్యర్థులు గుండెనిబ్బరం చేసుకొని వేచి చూడాల్సిందే.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ఓటు హక్కుపై అధికారులు కల్పించిన ప్రచారమో, మంచి అభ్యర్థిని ఎన్నుకోవాలన్న ఉత్సాహమో గానీ పోలింగ్ కేంద్రాల వద్ద సోమవారం ఓటర్లు పోటెత్తారు. ఉదయం ఏడు గంటల నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు బారులు తీరారు. పలుచోట్ల ఇవిఎంల మొరాయింపులతో గంటల కొద్దీ నిల్చొని తమ ఓటు హక్కును వినియోగించుకున్న తర్వాతే ఇళ్లకు వెళ్లారు. రాత్రి ఎంత సమయమైనా ఓటు వేసి వెళ్లాలన్న పట్టుదలను ప్రదర్శించారు. జిల్లాలో సార్వత్రిక ఎన్నికల పోలింగ్ చెదురు మదురు ఘటనలు మినహా ప్రశాంతంగా ముగిసింది. ఉదయం ఏడు గంటల నుంచే తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఓటర్లు బారులు తీరారు. ఎండ తీవ్రత, క్యూలైన్లు భారీగా ఉంటాయన్న ఉద్దేశంతో ఉదయం ఏడు గంటలకే గేట్ల ముందు నిరీక్షించారు. పల్లె, పట్టణం అనే తేడా లేకుండా ఓటు వేసేందుకు ఆసక్తి కనబరిచారు. సాయంత్రం ఆరు గంటలకు పోలింగ్ సమయం ముగిసినా, చాలా కేంద్రాల్లో ఓటర్లు బారులు తీరి కనిపించారు. (మిగతా...2లో)

మెళియాపుట్టి : ఓటు వేయడానికి వీల్‌చైర్‌లో వచ్చిన వృద్ధురాలు ఎండమ్మ



కంట్రోల్‌రూమ్ నుంచి కలెక్టర్ పర్యవేక్షణ

జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కంట్రోల్‌రూమ్ నుంచి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఎన్నికలు జరుగుతున్న తీరును పర్యవేక్షించారు. వెబ్‌కాస్టింగ్ ద్వారా వస్తున్న ఎల్ఇడి స్క్రీన్లపై వస్తున్న ప్రసారాలను వీక్షించారు. పొందూరు మండలంలో చోటుచేసుకున్న ఘర్షణలపై సెక్టార్ అధికారులు, పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేశారు. క్యూలైన్లలో ఓటర్లు పడుతున్న ఇబ్బందులను గమనించి రిటర్నింగ్ అధికారులతో నేరుగా మాట్లాడారు. ఓటరు హెల్ప్‌లైన్‌కు వస్తున్న ఫిర్యాదులపై ఎప్పటికప్పుడు నివేదికలు తెప్పించుకుని సమస్యలను పరిష్కరించారు. సెక్టార్ అధికారులు ప్రయాణిస్తున్న వాహనాల రూట్లను జిపిఎస్ ద్వారా పరిశీలిస్తూ సమస్యాత్మక కేంద్రాలకు వారిని పంపేలా సూచనలు ఇచ్చారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

- పోలింగ్ అనంతరం చర్చోపచర్చలు
- అభ్యర్థులతో పాటు నాయకుల ఆరా

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ముగిసిన నేపథ్యంలో అభ్యర్థులు, పార్టీల నాయకులు అంచనాల్లో మునిగిపోయారు. పోలింగ్ ప్రక్రియ ఆరు గంటలకు సమాప్తం కావడంతో కూడికలు, తీసివేతలు ప్రారంభించారు. పోలింగ్ ఎలా సాగింది, ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపారు, ఏ బూత్‌లో ఎలా ఉందనే విషయాలపై అనుచరులతో చర్చించారు. ఏ ప్రాంతంలో తమకు అనుకూలంగా ఓట్లు పడ్డాయి, ఎక్కడ ప్రతికూల పరిస్థితి ఎదురైందనే అంశాలపై ఆరా తీస్తున్నారు. మరోవైపు రాష్ట్రస్థాయిలో ఫలితాలు ఎలా ఉంటాయనే అంశంపైనా చర్చ జోరుగా సాగుతోంది. పోలింగ్ శాతం భారీగా నమోదు కావడంతో, ఎవరికి వారే అన్వయించుకునే పనిలో అభ్యర్థులు నిమగ్నమయ్యారు. అదేవిధంగా నాయకులు, ఏజెంట్లతో చర్చించి ఓటింగ్ సరళి ఎలా సాగిందో తెలుసుకున్నారు. బూత్‌ల వారీగా ఎక్కడ మెజార్టీ వస్తుంది, ఎక్కడ తగ్గుతుందని అంచనాలు వేస్తున్నారు. ఇదే సందర్భంలో కాంగ్రెస్ పార్టీ, స్వతంత్ర అభ్యర్థులు ఎవరి ఓట్లకు గండి కొట్టారా అన్న ఆందోళన కూడా ప్రధాన పార్టీ నాయకుల్లో నెలకొంది. ఇదే సమయంలో జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో ఎవరికి మెజార్టీ స్థానాలు వస్తాయన్నది చర్చనీయాంశంగా మారింది. తాము గెలుస్తామంటే, తాము గెలుస్తామంటూ వైసిపి, టిడిపి కూటమి అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తున్నారు. బూత్‌ల వారీగా ఓట్ల శాతాన్ని విశ్లేషణ చేయడం మొదలుపెట్టారు. పోలింగ్ సరళి ఆధారంగా గెలిచేది మనమే అంటూ శ్రేణులకు నాయకులు, కార్యకర్తలకు భరోసానిస్తున్నారు. పోలింగ్ (మిగతా...2లో)

ఓటు వేసేందుకు వికలాంగుడిని తీసుకొస్తున్న సహాయకుడు

స్ట్రాంగ్‌రూమ్‌కు ఇవిఎంలు

పోలింగ్ ప్రక్రియ ముగిసిన తర్వాత ఇవిఎంలకు రాజకీయ పార్టీల ఏజెంట్ల సమక్షంలో సీల్ వేశారు. అనంతరం వాటిని గట్టి పోలీసు బందోబస్తు మధ్య ఎచ్చెర్లలోని శివానీ ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూమ్‌ల్లో భద్రపరిచారు. ఇవిఎంలను భద్రపర్చిన అనంతరం మూడంచెల భద్రత ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు.

వృద్ధులు, వికలాంగులు సైతం...

వృద్ధులు సైతం తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు తమ వారి సాయంతో మండుటెండలోనే పోలింగ్ కేంద్రాలకు వచ్చారు. వికలాంగులు తమ వారి సాయంతో ఓట్లు వేసేందుకు తరలివచ్చారు. మహిళలు, యువత తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఉత్సాహంగా క్యూలో నిల్చొన్నారు.

అభ్యర్థులు ఎక్కడ ఓటు వేశారంటే...

ప్రజాశక్తి- శ్రీకాకుళం యంత్రాంగం

సార్వత్రిక ఎన్నికల్లో పోటీలో ఉన్న అభ్యర్థులతో పాటు ఉన్నతాధికారులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం నియోజకవర్గం నుంచి పోటీలో ఉన్న అభ్యర్థులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం వైసిపి అభ్యర్థి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పెద్దపాడులోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఆయన సతీమణి గజలక్ష్మి, కుమారుడు రామ్‌మనోహర్‌నాయుడు, కోడలు సుశ్రీలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి గొండు శంకర్ తన కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లి శ్రీకాకుళం రూరల్ మండలంలోని కిష్టప్పేటలో తన ఓటును వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి అంబటి కృష్ణారావు గార మండలం రామచంద్రాపురంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

నరసన్నపేట వైసిపి అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్ పోలాకి మండలంలోని మబుగాంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి బగ్గు రమణమూర్తి జలుమూరు మండలంలోని మర్రివలసలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి మంత్రి నరసింహమూర్తి నరసన్నపేటలో ఓటు వేశారు.

టెక్కలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ టెక్కలిలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కిల్లి కృపారాణి టెక్కలిలోని జూనియర్ కళాశాలలో గల పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పలాస నియోజకవర్గ వైసిపి అభ్యర్థి సీదిరి అప్పలరాజు తన సతీమణి శ్రీదేవితో కలిసి వజ్రపుకొత్తూరు మండలంలోని దేవునల్తాడలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి గౌతు శిరీష, ఆమె భర్త వెంకన్న చౌదరి పలాసలోని ప్రభుత్వ పాఠశాలలో గల పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి పిరియా విజయ సోంపేట మండలంలోని పలాసపురంలో గల పోలింగ్ కేంద్రంలో కుమార్తె జాగృతి, మామ పిరియా రాజారావుతో కలిసి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి బెందాళం అశోక్ సతీమణి నీలోత్పలతో కలిసి కవిటి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి ఎం.చక్రవర్తిరెడ్డి ఇచ్ఛాపురం మండలంలోని కేశుపురంలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఆమదాలవలస నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం తొగరాంలోని పోలింగ్ కేంద్రంలో సతీమణి వాణిశ్రీతో కలిసి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి కూన రవికుమార్ పొందూరు మండలంలోని పెనుబర్తిలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి సనపల అన్నాజీరావు ఆమదాలవలస మండలంలోని కొర్లకోటలో ఓటు వేశారు.

పాతపట్నం నియోజకవర్గ వైసిపి అభ్యర్థి రెడ్డి శాంతి మెళియాపుట్టి మండల కేంద్రంలోని పోలింగ్ కేంద్రంలో ఓటుహక్కును వినియోగించుకున్నారు. టిడిపి అభ్యర్థి మామిడి గోవిందరావు పాతపట్నం మండలంలోని తామరలో ఓటు వేశారు.

ఎచ్చెర్ల నియోజకవర్గ వైసిపి అభ్యర్థి గొర్లె కిరణ్‌కుమార్ రణస్థలం మండలం పాతర్లపల్లిలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. బిజెపి అభ్యర్థి నడుకుదిటి ఈశ్వరరావు బంటుపల్లిలో తన సతీమణితో కలిసి ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి కరిమజ్జి మల్లేశ్వరరావు నగరప్పాలెంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

శ్రీకాకుళం టిడిపి ఎంపీ అభ్యర్థి కోటబొమ్మాళి మండలం నిమ్మాడలో టిడిపి అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు తన భార్య శ్రీశ్రావ్యతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. వైసిపి అభ్యర్థి పేరాడ తిలక్ నందిగాం మండలంలోని కణితూరులో ఓటు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థి పేడాడ పరమేశ్వరరావు సంతబొమ్మాళి మండలంలోని ఇజ్జువరంలో కుటుంబసభ్యులతో కలిసి ఓటుహక్కును వినియోగించుకున్నారు.

విజయనగరం టిడిపి ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు కుటుంబసభ్యులతో కలిసి రణస్థలం మండలంలోని వి.ఎన్ పురంలో తన ఓటుహక్కును వినియోగించుకున్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

సిబ్బంది కృషి అభినందనీయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం

జిల్లాలో ఎన్నికలను స్వేచ్ఛగా, శాంతియుతంగా నిర్వహించి విజయవంతం చేయడంలో కృషి చేసిన ప్రతి ఒక్కరికీ జిల్లా ఎన్నికల అధికారి కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అభినందనలు తెలిపారు. పోలింగ్ ప్రక్రియ ముగిసిన అనంతరం కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సిబ్బందిని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. జట్టుగా పనిచేస్తే విజయం దక్కుతుందనడానికి అంతా కలిసి గడిచిన 14 గంటలుగా చేసిన శ్రమ నిదర్శనమని చెప్పారు. ఎన్నికలను జిల్లాలో విజయవంతం చేయడంలో కొద్ది నెలలుగా అంకితభావం, పట్టుదలతో విశేష కృషి చేసిన జిల్లా అధికారులకు, నోడల్ అధికారులకు, ఎన్నికల విధులు నిర్వహించిన అన్ని స్థాయిల్లో సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

గెలుపుపై ఎవరి ధీమా వారిదే

తర్వాత ముఖ్య నేతలతో సమీక్షలు ప్రారంభించారు. ఏ పోలింగ్ బూత్‌లో ఎన్ని ఓట్లు వస్తాయి, ఎక్కడ తమకు నష్టం వాటిల్లిందనే అంశాలపై ముఖ్య నేతలతో చర్చలు మొదలుపెట్టారు. మరోవైపు క్రాస్ ఓటింగ్ భయం నేతలను వెంటాడుతోంది. ఏడు నియోజకవర్గాల్లో ఎవరెవరికి ఎంతమేర ఓట్లు రానున్నాయో ఎంపీ అభ్యర్థులు లెక్కలు వేసుకుంటున్నారు. ముఖ్యంగా ఇండియా వేదిక బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థులు ఎంతమేర ప్రభావం చూపుతారన్న దాని మీద చర్చలు సాగుతున్నాయి. దీంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల్లో కొంత టెన్షన్ నెలకొంది. వీరి లెక్కలు ఇలా వేసుకుంటే, ఓటరు మాత్రం తన తీర్పునిచ్చి ప్రశాంతంగా ఉన్నాడు. అభ్యర్థుల భవితవ్యం ఇవిఎంల్లో నిక్షిప్తమైంది. అభ్యర్థులు గెలుపుపై పైకి గాంభీర్యం ప్రదర్శిస్తున్నా, లోలోపల వారిని భయం వెంటాడుతోంది. తమకు ఓటు వేస్తామని మాట ఇచ్చి ప్రత్యర్థికి వేశారేమోనన్న సందేహాలూ లేకపోలేదు. ఓటర్లు ఏం తీర్పునిచ్చారో చూడాలంటే వచ్చే నెల నాలుగో తేదీ వరకు చూడాల్సి ఉంది. అంతవరకు అభ్యర్థులకు నిరీక్షణ తప్పదు.

ఓటెత్తారు

ఆ సమయానికి లైన్‌లో ఉన్న వారికి ఓటు వేసే వరకు అవకాశం కల్పించారు. దీంతో పోలింగ్ పలుచోట్ల రాత్రి 11 గంటలు దాటింది. జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాల్లో రాత్రి 11 గంటల వరకు 74.99 శాతం ఓటింగ్ నమోదైంది.

ఉదయం ఏడు గంటలకు పోలింగ్ ప్రారంభం కాగా, తొలి రెండు గంటల్లో కాస్త మందకొడిగా సాగింది. ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల మధ్య కాలంలో భారీగా ఓటింగ్ శాతం నమోదైంది. కొన్ని నియోజకవర్గాల్లో అమాంతంగా పోలింగ్ శాతం పెరిగింది. మొదటి రౌండ్‌లో ఎచ్చెర్ల నియోజకవర్గంలో 3.91 శాతం నమోదు కాగా, రెండో రౌండ్‌లో ఏకంగా 18 శాతం నమోదైంది. పాతపట్నంలో 7.22 శాతం నుంచి 22.55 శాతానికి పెరిగింది. శ్రీకాకుళంలో ఎనిమిది నుంచి 23 శాతానికి చేరింది. పలాసలో 8.9 శాతం నుంచి 20.02 శాతానికి వెళ్లింది. టెక్కలిలో 10 శాతం నుంచి 27 శాతానికి చేరింది. ఆమదాలవలసలో 9.57 శాతం నుంచి 22.55 శాతానికి చేరింది. నరసన్నపేటలో 10.08 శాతం నుంచి 25.12 శాతంకు పెరిగింది. అక్కడ నుంచి సాధారణంగానే పెరుగుదల శాతం ఉంది.

సూచనలు చేస్తున్న ఎస్‌పి రాధిక

ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యులు

శాసనసభ స్పీకర్, ఆమదాలవలస వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం తొగరాంలోని పోలింగ్ కేంద్రంలో సతీమణి వాణిశ్రీతో కలిసి వెళ్లి ఓటు హక్కును వినియోగించుకున్నారు. శ్రీకాకుళం వైసిపి అభ్యర్థి, రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు పెద్దపాడులోని పోలింగ్ కేంద్రంలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. పలాస వైసిపి అభ్యర్థి, పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తన సతీమణి శ్రీదేవితో కలిసి వజ్రపుకొత్తూరు మండలంలోని దేవునల్తాడలో ఓటు హక్కు వినియోగించుకున్నారు. నరసన్నపేట వైసిపి అభ్యర్థి, మాజీ ఉప ముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ పోలాకి మండలంలోని మబుగాంలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. టెక్కలి నియోజకవర్గ టిడిపి అభ్యర్థి, టిడిపి రాష్ట్ర అధ్యక్షులు కింజరాపు అచ్చెన్నాయుడు నిమ్మాడలో తన ఓటు హక్కును వినియోగించుకున్నారు.

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని, ఎస్‌పి జి.ఆర్ రాధిక స్వయంగా పరిశీలించారు. శ్రీకాకుళం, ఆమదాలవలసలోని పలు పోలింగ్ కేంద్రాలను డిఐజి విశాల్ గున్ని సందర్శించారు. టెక్కలి, కోటబొమ్మాళి, నరసన్నపేట పోలింగ్ కేంద్రాలతో పాటు పలు కేంద్రాలను ఎస్‌పి జి.ఆర్ రాధిక పరిశీలించారు. పోలింగ్ జరుగుతున్న తీరుపై ఆరా తీశారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా భద్రతా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

పలుచోట్ల కొట్లాటలు, తోపులాటలు

పొందూరు మండలం గోకర్ణపల్లిలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య కొట్లాటలో నలుగురికి గాయాలయ్యాయి. ఇరు పార్టీల పోలింగ్ ఏజెంట్ల మధ్య చోటుచేసుకున్న స్వల్ప వివాదం కొట్లాటకు దారితీసింది. గాయపడిన వారిని 108 వాహనం ద్వారా శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించి చికిత్సను అందిస్తున్నారు. కొట్లాటతో సుమారు గంటన్నర పాటు పోలింగ్ నిలిచిపోయింది. అదే గ్రామంలోని పోలింగ్ కేంద్రంలో పోలింగ్ తీరును పరిశీలించేందుకు జనరల్ ఏజెంట్‌గా వచ్చిన శాసనసభ స్పీకర్, వైసిపి అభ్యర్థి తమ్మినేని సీతారాం సతీమణి వాణిశ్రీని బయటకు పంపించాలని టిడిపి నాయకులు పోలీసులను పట్టుబట్టారు. కొంతసేపటి తర్వాత ఆమె వెళ్లిపోవడంతో వివాదం సద్దుమణిగింది.

మొదటి పేజీ తరువాయి

ఆమదాలవలస మున్సిపాల్టీలోని కుద్దిరాంలో ఏజెంట్ల విషయంలో తలెత్తిన వివాదం సందర్భంగా టిడిపి కార్యకర్త మొయ్యి రమణమూర్తిపై అదే ప్రాంతానికి చెందిన వైసిపి నాయకులు చేసిన దాడిలో ఆయన గాయపడ్డారు. గార మండలంలో వైసిపి నాయకులు రెచ్చిపోయారు. కళింగపట్నం, అరంగిపేటలో ఓటర్లు భయభ్రాంతులకు గురయ్యేలా వ్యవహరించి, ఓటరు స్లిప్పులు అందజేస్తున్న టిడిపి శిబిరాలపై దాడి చేసి శిబిరాన్ని ధ్వంసం చేశారు. ఓటరు జాబితాలను చించివేశారు. ఓట్లు వేసేందుకు వచ్చిన పలువుని అడ్డగించారు. శ్రీకాకుళం రూరల్ మండలం చాపురంలో వైసిపి, టిడిపి నాయకుల మధ్య ఘర్షణలో ఇద్దరు వైసిపి, ఇద్దరు టిడిపి నాయకులకు గాయాలయ్యాయి. వీరిని శ్రీకాకుళం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తరలించారు. వజ్రపుకొత్తూరు మండలంలోని పెద్దమురహరిపురం 259 పోలింగ్ బూత్‌లోకి మంత్రి అప్పలరాజు తన అనుచరులతో ప్రవేశించగా, టిడిపి నాయకులు అభ్యంతరం తెలపడంతో స్వల్ప వివాదం చోటుచేసుకుంది. గరుడఖండిలో పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేయడానికి వచ్చిన వైసిపి కార్యకర్తను టిడిపి నాయకులు అడ్డుకున్నారు. లావేరు మండలం వెంకటాపురంలో పోలింగ్ కేంద్రం వద్ద రాజకీయ పార్టీలు ఇచ్చే ఓటరు స్లిప్‌లపై పార్టీ గుర్తులు ఉండడంతో, ఇరు పార్టీల కార్యకర్తల మధ్య తోపులాటలు చోటుచేసుకుంది. జి.సిగడాం మండల కేంద్రంలో ఇరు పార్టీల ఏజెంట్లు గొడవ పడ్డారు.

పలాసలో లాఠీఛార్జి

పలాస ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద టిడిపి నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని ఆరోపిస్తూ వైసిపి నాయకులు పోలింగ్ కేంద్రంలోకి వెళ్లేందుకు ప్రయత్నించారు. వారిని సిఐ విజయ్‌కుమార్‌తో పాటు ఆర్‌పిఎఫ్ సిబ్బంది అడ్డుకుని వెళ్లిపోవాలని సూచించారు. అయినా వారు వినకపోవడంతో పోలీసులు లాఠీఛార్జి చేసి వారిని చెదరగొట్టారు. కౌన్సిలర్‌కు స్వల్ప గాయం కావడంతో సిఐకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ బైఠాయించడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావు అక్కడకు చేరుకుని వారికి సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది.

టిడిపి అభ్యర్థిని అడ్డుకున్న వైసిపి నాయకులు

శ్రీకాకుళం రూరల్ మండలంలోని ఇప్పిలిలో పోలింగ్ సరళిని పరిశీలించేందుకు వెళ్లిన టిడిపి అభ్యర్థి గొండు శంకర్‌ను వైసిపి నాయకులు అడ్డుకున్నారు. గ్రామంలోకి వెళ్లనీయకుండా ఆయన వాహనాన్ని అడ్డుకోవడంతో ఆయన రోడ్డుపై బైఠాయించారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు అక్కడకు చేరుకోవడంతో ఉద్రిక్త వాతావరణం నెలకొంది. సిఐ సన్యాసినాయుడు చేరుకుని సర్దిచెప్పడంతో శంకర్ గ్రామంలోకి వెళ్లారు. ఎచ్చెర్ల మండలం ధర్మవరంలో ఎమ్మెల్యే కిరణ్ కుమార్ క్యూలో ఉన్న ఓటర్లకు ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని చెప్పంతో టిడిపి నాయకులు నిలదీశారు.

ఇవిఎంల మొరాయింపు

ఆమదాలవలస పురపాలక సంఘం పరిధిలోని 15, 22 వార్డు పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల్లో ఇవిఎంలు మొరాయించడంతో సుమారు 40 నిమిషాలు ఆలస్యంగా పోలింగ్ ప్రారంభమైంది. పొందూరు మండలంలోని గోకర్ణపల్లి, బురిడికంచరాం, రాపాక, తాడివలస తదితర పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించాయి. వజ్రపుకొత్తూరు మండలం మంచినీళ్లపేట 233 బూత్‌లో ఇవిఎం మొరాయించడంతో పోలింగ్ గంట ఆలస్యమైంది. కోటబొమ్మాళి మండలంలో ఇవిఎంలు మొరాయించడంతో జియ్యన్నపేటలో ఉదయం తొమ్మిది గంటలకు, చీపుర్లపాడులో 10 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది. కొత్తూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రంలో పోలింగ్ ప్రారంభమైన అరగంట తర్వాత ఇవిఎంలు మొరాయించడంతో సుమారు గంటపాటు మొరాయించాయి. ఎచ్చెర్ల మండలంలోని ఫరీదుపేట, ముద్దాడ, చిన్నకొంగరాం, భగీరథపురంలోనూ ఇవిఎంలు మొరాయించాయి. బిహెచ్ఇఎల్ ఇంజినీర్లు సాంకేతిక సమస్యలను సరిచేయడంతో పోలింగ్ ప్రారంభమైంది.

పిఒ తీరుపై ఆందోళన

రణస్థలం మండలం గిరివానిపాలెం 142 పోలింగ్ కేంద్రంలో ఒక వృద్ధునితో పిఒ ఫ్యాన్ గుర్తుకు బదులు కమలం గుర్తుకు ఓటేయించారంటూ వైసిపి నాయకులు ఆందోళనకు దిగారు. ఇక్కడ రీపోలింగ్ నిర్వహించాలని, పిఒ తిరుపతిరావును సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.

పలాస మండలం బ్రాహ్మణతర్లాలోని 35వ పోలింగ్ కేంద్రంలో ఓపిఒగా పనిచేస్తున్న తేజేశ్వరరావుకుమార్ రథో ఫిట్స్ రావడంతో, ఆయన స్థానంలో రిజర్వులో ఉన్న వారిని నియమించారు.

స్ట్రాంగ్‌రూమ్‌కు తరలిస్తున్న ఇవిఎంలు

జిల్లాలో పలుచోట్ల ఘర్షణలు

పలాస : బైఠాయించిన వైసిపి నాయకులు

పలాస : పలాస ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద సోమవారం వైసిపి నాయకులు గలాటా చేయడంతో పోలీసులు చెదగొట్టారు. పోలింగ్ కేంద్రంలో టిడిపి నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడుతున్నారని వైసిపి నాయకులు కేంద్రంలోకి వెళ్తేందుకు ప్రయత్నించారు. విధుల్లో ఉన్న సిఐ విజయ్‌కుమార్‌తో పాటు ఆర్‌పిఎఫ్ సిబ్బంది వారిని వెళ్లిపోవాలని సూచించారు. అయినా వినకపోవడంతో పోలీసులు లాఠీ ప్రదర్శించారు. కౌన్సిలర్‌కు స్వల్ప గాయం కావడంతో సిఐకు వ్యతిరేకంగా నినాదాలు చేయి బైటాయించడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న కాశీబుగ్గ డిఎస్‌పి నాగేశ్వరరావు, సిఐ, ఎస్‌ఐ పారినాయుడు ఆందోళనకారులతో మాట్లాడి వారిని పంపించడంతో వివాదం సద్దుమణిగింది. ఇదిలా ఉండగా టిడిపి నాయకులు రిగ్గింగ్‌కు పాల్పడడానికి వెళ్లారని ఆరోపించిన వ్యవహారంలో నిజం లేదని పోలీసులు, ఎన్నికల అధికారులు తెలిపారు. పట్టణ టిడిపి కార్యదర్శి సప్ప నవీన్ పోలింగ్ ఏజెంటుగా పనిచేశారని అన్నారు. మధ్యాహ్నం భోజన విరామం కోసం బయటకు వెళ్లి తిరిగి పోలింగ్ కేంద్రానికి వెళ్తుండగా... రిగ్గింగ్‌కు పాల్పడడానికి వెళ్తున్నారని భావించి వైసిపి నాయకులు గలాటా చేసిశారని స్పష్టమైంది.

అలాగే కాశీబుగ్గ యుపి పాఠశాల, చిన్నబడాం, చినంచల, పెదంచల గ్రామాల్లో వైసిపి, టిడిపి నాయకుల మధ్య స్వల్ప ఘర్షణ చెలరేగింది. పోలీసులు వారికి నచ్చచెప్పి పంపించడంతో వివాదం సద్దువణిగింది. గరుడఖండి వద్ద పోలింగ్ కేంద్రంలో దొంగ ఓట్లు వేయడానికి వైసిపి నాయకులు వచ్చారని టిడిపి నాయకులు ఆరోపించారు.

బ్రాహ్మణతర్లా 35వ పోలింగ్ కేంద్రంలో ఒపిఒగా పనిచేస్తున్న తేజేశ్వరరావుకుమార్ రథో అస్వస్థలకు గురికావడంతో ఆయన స్థానాన్ని వేరే వ్యక్తిని నియమించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని పెద్దమురహరిపురం 259 పోలింగ్ బూత్ వద్ద మంత్రి అప్పలరాజు స్థానిక టిడిపి నాయకుల మధ్య స్వల్ప వివాదం తలెత్తింది. మంత్రి బూత్‌లో ప్రవేశిస్తుండగా... ఆయన వెంట మరి కొంత మంది వెళ్లడంతో టిడిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్వల్ప వివాదం చోటుచేసుకుంది. మంత్రి బూత్‌లోకి ప్రవేశిస్తుండగా... ఆయన వెంట మరి కొంత మంది వెళ్లడంతో టిడిపి నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై స్వల్ప వివాదం చోటుచేసుకుంది. అంతకుముందు వేరే పోలింగ్ బూత్‌లో కనిపించిన టిడిపి నాయకుడు దేవదాసును ఇక్కడ ఎందుకు ఉన్నావని మంత్రి ప్రశ్నించారు. దీంతో వాగ్వివాదం చోటు చేసుకుంది. పోలీసులు అప్రమత్తమై సర్దిచెప్పారు.

కొత్తూరు : మండలంలోని 42 పంచాయతీల్లో నిర్వహించిన పోలింగ్ ఒకటి రెండు చోట్ల స్వల్ప ఘర్షణలు మినహా మిగతా అంతా ప్రశాంతంగా సాగింది. సిరుసువాడ, కొత్తూరు టెండర్ల ఓటు వేయించారు. కొత్తూరు పోలింగ్ కేంద్రాన్ని ఎఎస్‌పి ప్రేమకాజల్ పరిశీలించారు. అలాగే ఎమ్మెల్యే రెడ్డి శాంతి, టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి మామిడి గోవిందరావులు పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, ఆయన సతీమణి ఇందిర, కుమార్తెలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. సాయంత్రం 5 గంటలకు అందించిన సమాచారం ప్రకారం 63.25 శాతం పోలింగ్ నమోదైంది.

జి.సిగడాం : జి.సిగడాం పోలింగ్ కేంద్రం పదో నంబరు పోలింగ్ కేంద్రంలో కూటమి అభ్యర్థి గుర్తు పోలింగ్ బూత్ లోపల చూపించారు. అదే విషయాన్ని వైసిపి ఏజెంట్ అడగా ఘర్షణగా ప్రారంభమై కొట్లాటకు దారితీసింది. మొత్తం ఐదు పోలింగ్ కేంద్రాలకు ఇద్దరే ఇద్దరు పోలీసులను నియమించడంతో ఓటర్లు అసహనం వ్యక్తం చేశారు.

కొత్తూరు : మండలంలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సిరుసువాడ, వసప పోలింగ్ కేంద్రాల వద్ద స్వల్ప ఘర్షణలు చోటు చేసుకుంది. సిరుసువాడలో మాజీ సర్పంచ్ ప్రతినిధి అర్జున్‌పాత్రో తన భార్య ఓటు తీసుకొని వెళ్లారు. అదేవిధంగా మరొక వ్యక్తి నా భార్యకు ఓటు వేయడం రాదని, నేనే వేస్తానని పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించారు. దీంతో ఇరు గ్రూపుల మధ్య ఘర్షణకు దారితీసింది. సమాచారం అందుకున్న సిఐ ఆర్.వేణుగోపాలరావు, ఎస్‌ఐ ఎ.అహ్మద్ చేరుకుని చెదరగొట్టారు. అలాగే వసపలో పోలింగ్ కేంద్రం పరిసరాల్లో ద్విచక్ర వాహనం పార్కింగ్‌పై మాటామాట పెరగడంతో గొడవకు దారితీసింది. ప్రధాన రహదారిపై ఇరు గ్రూపుల మధ్య తోపులాట చేసుకోగా, పోలీసులు వారిని చదరగొట్టి పోలింగ్ కేంద్రం పరిసరాల నుంచి పంపించేయడంతో సమస్య సర్దుమణిగింది.

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడలో టిడిపి, వైసిపి కార్యకర్తల మధ్య స్వల్ప ఘర్షణ చోటు చేసుకుంది. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఎమ్మెల్యే అచ్చెన్నాయుడు కుమారుడు కృష్ణమోహన్ నాయుడు నౌపడ పోలింగ్ బూత్‌ను సందర్శించారు. ఈ సమయంలో పలువురు టిడిపి కార్యకర్తలు అచ్చెన్నాయుడు అనుకూలంగా నినాదాలు చేశారు. ఈ విషయమై పలువురు వైసిపి కార్యకర్తలు అభ్యంతరం వ్యక్తం చేశారు. ఆయన తిరిగి వెళ్ళిన అనంతరం వైసిపి, టిడిపి కార్యకర్తలు స్వల్ప ఘర్షణకు దిగారు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు కలగజేసుకొని ఇరు గ్రూపుల వారిని చెదరగొట్టారు.

నౌపడ : వాగ్వివాదానికి దిగిన వైసిపి, టిడిపి నాయకులు

ఇచ్ఛాపురం : ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి నాయకులు

కొత్తూరు : చెదరగొడుతున్న పోలీసులు

ఇచ్ఛాపురం: మండలంలోని బాలకృష్ణాపురం పంచాయతీలో పోలింగ్ సమయంలో వైసిపి, టిడిపి కార్యకర్తల మధ్య పోలింగ్ సమయంలో ఘర్షణ వాతావరణం చోటు చేసుకుంది. దీంతో పరిస్థితి కొద్దిగా ఉద్రిక్తత నెలకొంది. విషయం తెలుసుకున్న సిఐ టి.ఇమ్మాన్యుయేల్ రాజు, టౌన్ ఎస్‌ఐ సత్యనారాయణలు పోలీస్ బృందాన్ని పంపించారు. వారు వచ్చి ఇరు గ్రూపు నాయకులను చెదరగొట్టారు.

గార : మండలంలోని కళింగపట్నం, అరంగిపేట గ్రామాల్లో భయభ్రాంతులకు గురయ్యేలా వ్యవహరించి ఓటర్ స్లిప్పులు అందజేస్తున్న టిడిపి శిబిరంపై పోలీసుల సమక్షంలోనే దాడికి తెగబడ్డారు. టిడిపి శిబిరాలను ధ్వంసం చేసి ఓటరు జాబితాలను చింపివేశారు. ఓట్లు వేసేందుకు వచ్చిన టిడిపి సానుభూతిపరులతో పాటు పలువురు ఓటర్లను పోలింగ్ కేంద్రంలోకి వెళ్లనీయకుండా అడ్డుకున్నారు. దీనితో సమాచారం అందుకున్న పోలింగ్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకోవడంతో వారు నెమ్మదిగా జారుకున్నారు. కాగా, విధుల్లో ఉన్న పోలీస్ సిబ్బందిని, టిడిపి పోలింగ్ ఏజెంట్ల నుంచి జరిగిన ఘటనపై వివరాలు తీసుకుని ఉన్నతధికారులకు వివరించారు.

శ్రీకాకుళం రూరల్ : మండలంలోని చాపురం ప్రాథమికోన్నత పాఠశాలలో పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లు క్యూలైన్‌లో ఉన్నారు. ఈ సమయంలో టిడిపి, వైసిపి నాయకులు ఉదయం నుంచి తమ తమ పార్టీల నాయకులకు ఓటు వేయాలని ఓటర్లను కోరారు. సాయంత్రానికి నాయకుల మధ్య మాటయుద్ధం ప్రారంభమైంది. అది కాస్త కొట్లాటకు దారితీసింది. ఈ కొట్లాటలో వైసిపి నాయకులు అల్లు అనీల్, అల్లు గణపతి, అల్లు కృష్ణ, అల్లు శ్రీనివాస్, అల్లు లక్ష్మి, మరొకరు, టిడిపి నాయకులు అల్లు శ్రీను, అల్లు లక్ష్మి, టి.లక్ష్మిలు గాయపడ్డారు. వీరిని ఆయా కుటుంబ సభ్యులు జిల్లా సర్వజనాస్పత్రికి చికిత్స కోసం తరలించారు. సమాచారం అందుకున్న వన్‌టౌన్ సిఐ, శ్రీకాకుళం రూరల్ ఎస్‌ఐ సంఘటానాస్థలానికి చేరుకున్నారు. దీంతో గ్రామంలో 144 సెక్షన్ అమలు చేశారు. అలాగే కల్లేపల్లిలో పోలింగ్ కేంద్రం వద్ద వైసిపి, టిడిపి నాయకులు ప్రచారం చేయడంతో ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసులు చేరుకుని చెదరగొట్టారు.

గోకర్ణపల్లిలో కొట్లాట

ముగ్గురికి తీవ్ర గాయాలు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లిలో సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో టిడిపి, వైసిపి వర్గాల మధ్య జరిగిన కొట్లాటలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఉదయం పోలింగ్ ప్రారంభం కాగానే ఇరుపార్టీలకు సంబంధించి పోలింగ్ ఏజెంట్ల మధ్య జరిగిన స్వల్ప వివాదం ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు దాడులు చేసుకోవడంతో సమీపంలో ఉన్న కర్రలతో ఒక వర్గం దాడి చేయడంతో పలువురికి గాయాలయ్యాయి. ఇందులో సర్పంచ్ గ్రూపునకు చెందిన వైసిపి నాయకులు చింతాడ జీవర్నతం భాస్కర్, యతేంద్ర, సంపతిరావు సూర్యనారాయణలకు తీవ్ర గాయాలయ్యాయి. మరొకరు స్వల్పంగా గాయపడ్డారు. దీంతో వీరిని 108 వాహనం ద్వారా జిల్లా సర్వజనాస్పత్రికి తరలించారు. పోలీసుల సమక్షంలోనే దాడులకు పాల్పడ్డారని సర్పంచ్ గ్రూపునకు చెందిన నాయకులు ఆరోపిస్తున్నారు. పోలింగ్ సమయంలో తమపై కావాలనే వైసిపి గ్రూపునకు చెందిన నాయకులు దురుసుగా ప్రవర్తించి దాడి చేశారంటూ టిడిపి వర్గం ఆరోపిస్తున్నారు. గ్రామంలో నెలకున్న ఉద్రిక్తత పరిస్థితి దృష్ట్యా పోలీస్ పికెట్‌ను ఏర్పాటు చేశారు.

గంటన్నర పాటు నిలిచిన పోలింగ్

ఈ కొట్లాటతో పోలింగ్ సిబ్బందితోపాటు, ఓటర్లు భయాందోళనకు గురై పారిపోయారు. ఓటు వేసేందుకు గ్రామస్తులు భయాందోళన చెంది ఎవరూ రాకపోవడంతో సుమారు గంటన్నర పాటు పోలింగ్ నిలిచిపోయింది. ఈ కొట్లాట విషయం తెలియడంతో జెసి నవీన్‌కుమార్, డిఎస్‌పి శృతి, సిఐ దివాకర్ యాదవ్‌లు గ్రామానికి చేరుకుని ఇరు గ్రూపులతో సామరస్యంగా మాట్లాడి పోలింగ్‌ను పున:ప్రారంభించారు. ఈ విషయం తెలిసిన వెంటనే వైసిపి అభ్యర్థి సీతారాం సతీమణి తమ్మినేని వాణీశ్రీ, టిడిపి అభ్యర్థి కూన రవికుమార్‌కు చేరుకుని ఆయా వర్గాలతో మాట్లాడి విషయాన్ని తెలుసుకుని అధికారులతో మాట్లాడారు.

ముందుస్తు ప్రణాళికలే?

సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో పోలింగ్ వద్ద ఘర్షణలు తలెత్తే సమయంలో ఒకరిపై ఒకరుదాడులు చేసుకునేందుకు ముందుస్తుగా ప్రణాళికలు వేసుకున్నట్లు గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. సమీపంలోనే కర్రలు, రాళ్లను పెట్టుకున్నారంటూ ఇరువర్గాలు ఆరోపించుకుంటున్నారు.

రిమ్స్‌లో చికిత్స పొందుతున్న వైసిపి నాయకులు

జెసి నవీన్‌కు వివరిస్తున్న సర్పంచ్ మాధురి

గ్రామంలో పర్యటిస్తున్న డిఎస్‌పి శృతి

టిడిపి కార్యకర్తపై దాడి

గాయపడిన రమణమూర్తి

ఆమదాలవలస : పురపాలక సంఘం పరిధిలోని 21వ వార్డు కుద్దిరాంలో టిడిపి కార్యకర్త మొయ్యిల రమణమూర్తిపై అదే వార్డుకు చెందిన వైసిపి నాయకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. ఎన్నికల పోరులో భాగంగా ఏజెంట్ల విషయంలో తలెత్తిన వివాదం కొట్లాటకు దారితీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని ఇరు గ్రూపుల అక్కడి నుంచి చెదరగొట్టారు. ఇదే విషయమై బాధితుడు రమణమూర్తి మాట్లాడుతూ తనపై వైసిపి నాయకుడు సాధు చిరంజీవి, అతని అనుచరులు దాడి చేసి గాయపరచారని తెలిపారు. తీవ్రంగా గాయపడిన రమణమూర్తిని 108 సహాయంతో ఆస్పత్రికి తరలించారు.

పలుచోట్ల తోపులాటలు

లావేరు : మండలంలోని వెంకటాపురంలోని పోలింగ్ కేంద్రం వద్ద టిడిపి, వైసిపి పార్టీలు ఓట్లకు ఇచ్చిన స్లిప్పులపై పార్టీల గుర్తు ఉన్నాయని నిలదీయడంతో ఇరు గ్రూపుల వారు తోపులాటలు చోటు చేసుకున్నాయి., పోలీసులు వచ్చి సర్దుబాటు చేసి ఇరు గ్రూపుల వారిని చెదరగొట్టారు. అలాగే తాళ్లవలసలో ఇరు గ్రూపుల మధ్య ఓట్లు విషయం గొడవలు పడి కొట్టుకోవడంతో స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి వారిని చెదరగొట్టారు. లావేటిపాలెంలో జనసేన ఎచ్చెర్ల ఇన్‌చార్జి విశ్వక్సేన్ పోలింగ్ కేంద్రం సమీపంలో కార్యకర్తలతో మాట్లాడుతున్నారు. ఈ సమయంలో వైసిపి నాయకులు నిలదీయడంతో స్వల్ప తోపులాట జరిగింది చిన్నమురపాక, కొత్తకోట తదితర గ్రామాల్లో స్వల్ప వివాదాలు జరిగాయి మండలంలో 69 పోలింగ్ కేంద్రాలు ఉండగా పోలీసులు బందోబస్తు చాలక ఒక బూత్ వద్ద ఒక కానిస్టేబుల్ చొప్పున కేటాయించారు. దీంతో ఇరు పార్టీల కార్యకర్తలు ఇష్టానుసారంగా వ్యవహరించారు. అదపాకలో స్వల్ప తోపులాట చోటు చేసుకుంది. సమాచారం అందుకున్న లావేరు ఎఎస్‌ఐ ప్రసాద్ లాఠీఛార్జీ చేయడంతో గాయపడ్డామని లబ్బ సరస్వతి, పుష్పలు వాపోయారు. జె.ఆర్.పురం సిఐ జి.రామచంద్రరావు పర్యవేక్షిస్తున్నారు

ఘర్షణ పడుతున్న వైసిపి, టిడిపి నాయకులు

కవిటి : రంగారావుని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే అశోక్

వ్యక్తికి గాయాలు

కవిటి: మండలంలోని పోలింగ్ ముగిసిన అనంతరం వైసిపి, టిడిపి మధ్యన జరిగిన ఘర్షణలో టిడిపి కార్యకర్త వజ్జ రంగారావు గాయపడ్డాడు. వైసిపి గ్రూపునకు చెందిన ఒక వ్యక్తిని కులం పేరుతో దూషిస్తూ వేలెత్తి చూపిస్తూ బెదిరించాడనే కారణంతో రంగారావుపై ఈ దాడి జరిగినట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యే అశోక్ బాధితుడిని పరామర్శించారు. మండలంలో ఎప్పుడూ లేని సంస్కృతిని వైసిపి నాయకులు తీసుకొచ్చారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సిరా చుక్క చూపిస్తున్న స్పీకర్ సీతారాం, వాణిశ్రీ దంపతులు

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

పశుసంవర్ధకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు దంపతులు

పోలాకి : మబుగాంలో ఓటు వేసిన కృష్ణదాస్ దంపతులు

కోటబొమ్మాళి : సిరా చుక్క చూపిస్తున్న ఎంపీ రామ్మోహన్ నాయుడు

కోటబొమ్మాళి : ఓటు వేసిన అచ్చెన్నాయుడు కుటుంబసభ్యులు



ఓటు వేస్తున్న రెడ్డి శాంతి

రవికుమార్

పరిశీలిస్తున్న అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా

టెక్కలి : నర్సింగపల్లి మోడల్ పోలింగ్ కేంద్రం వద్ద నృత్యం చేస్తున్న గిరిజనులు

పోలింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బంది

లావేరు : ఓటు వేసేందుకు లైన్‌లో నిల్చొన్న ఓటర్లు

సిరా చుక్క చూపిస్తున్న ఎమ్మెల్యే అశోక్ దంపతులు

ఓటేశారు..

ప్రజాశక్తి- జిల్లా విలేకరుల యంత్రాంగం

సిక్కోలు ఓటర్లు ఓటోత్సాహంతో పోటెత్తారు. ఒక పార్లమెంట్ స్థానం, విజయనగరం పార్లమెంట్ స్థానంలో ఎచ్చెర్ల శాసనసభ, మరో ఏడు శాసనసభ నియోజకవర్గాలకు జరిగిన ఎన్నికలు స్వల్ప ఘటనలు మినహా పోలింగ్ ప్రశాంతంగా ముగిసింది. ఈవిఎంలు పలుచోట్ల సాంకేతిక కారణాలతో పని చేయకపోవడంతో ఓటర్లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండి తీవ్ర దృష్ట్యా సాయంత్రం 5 గంటల తరువాత ఓటర్లు తరలిరావడంతో రాత్రి 10 గంటల వరకు పలు చోట్ల పోలింగ్ నిర్వహించారు.

బెలూన్లు ఎగురవేస్తున్న మహిళలు

టెక్కలి రూరల్ : సిరా చుక్క చూపిస్తున్న కిల్లి కృపారాణి కుటుంబసభ్యులు

జలుమూరు : సిరా చుక్క చూపిస్తున్న రమణమూర్తి

శ్రీకాకుళం రూరల్ : సిరా చుక్క చూపిస్తున్న గొండు శంకర్

ఇచ్ఛాపురం : సిరా చుక్క చూపిస్తున్న పిరియా విజయ

టెక్కలి : సిరా చుక్క చూపిస్తున్న దువ్వాడ శ్రీనివాస్

అప్పలనాయుడు

రాజ్యలక్ష్మి...



నందిగాం : పేరాడ తిలక్...

ఎచ్చెర్ల ఎమ్మెల్యే కిరణ్‌కుమార్...

గౌతు శిరీష దంపతులు

ఈశ్వరరావు, రజని దంపతులు

సనపల అన్నాజీరావు

ఎచ్చెర్ల : సిరా చుక్క వేయించుకుంటున్న కాంగ్రెస్ అభ్యర్థి మల్లేశ్వరరావు

నందిగాం : ఓటు వేసేందుకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఓటర్లు

సిరా చూపిస్తున్న చక్రవర్తిరెడ్డి

ఇవిఎంల మొరాయింపు

ఆమదాలవలస : క్యూలైన్లలో బారులు తీరిన ఓటర్లు

ప్రజాశక్తి- ఆమదాలవలస

పురపాలక సంఘం, మండలంలో పలుచోట్ల ఇవిఎంలు మొరాయించడంతో ఏడు గంటలకు ప్రారంభం కావాల్సిన పోలింగ్ సుమారు 40 నిమిషాల పాటు ఆలస్యంగా ప్రారంభమయ్యాయి. పురపాలక సంఘ పరిధిలోని 15వ వార్డు పరిధిలోని డిగ్రీ కాలేజీలో ఏర్పాటుచేసిన బూత్ నెంబర్ 34లో 22వ వార్డు పరిధిలోని లక్ష్ముడుపేట ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటుచేసిన బూత్ నెంబర్ 67 లోను అలాగే మండలంలోని బొబ్బిలి పేటలో 220 ఓట్లు పోలైన తర్వాత ఇవిఎం మొరాయించి పోలింగ్ సుమారు గంటపాటు నిలిచిపోయింది. దీంతో పోలింగ్ అధికారులు మరో ఇవిఎంను ఏర్పాటు చేసి పోలింగ్‌ను కొనసాగించారు. అలాగే అక్కులపేటలో కొద్దిసేపు ఇవిఎంలు మొరయించినప్పటికీ సిబ్బంది సరిచేయడంతో మళ్లీ యధావిధిగా పోలింగ్ ప్రారంభమవ్వడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

ఆలస్యంగా ప్రారంభమైన పోలింగ్

పొందూరు: మండలంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలు పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించాయి. మండలంలోని గోకర్ణపల్లి, బురిడీకంచరాం, రాపాక, తాడివలస తదితర పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించాయి. తక్షణమే అధికారులు స్పందించి ఇవిఎంలు సరిచేశారు.

వజ్రపుకొత్తూరు: మంచినీళ్లపేట 233 బూత్‌లో ఇవిఎం మోరాయించడంతో పోలింగ్ ప్రక్రియ సుమారు ఒక గంట ఆలస్యమైంది. మొరాయించిన ఇవిఎంను పలాస ఆర్‌డిఒ కార్యాలయానికి తరలించి అక్కడ నుంచి కొత్త ఇవిఎం తీసుకొచ్చారు. అనంతరం ఓటింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించారు.

కోటబొమ్మాళి:మండలంలో ఇవిఎంలు మొరాయించడంతో జీయన్నపేటలో ఉదయం 9 గంటలకు, చీపుర్లపాడులో 10 గంటలకు పోలింగ్ ప్రారంభమైంది.

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 250, 251 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రారంభమైన అరగంట తరువాత ఇవిఎంలు సుమారు గంటపాటు మొరాయించడంతో ఓటర్లు వరుస క్రమంలో ఉండడంతో సమయం వృథాతో పాటు వృద్ధులు, వికలాంగులు, మహిళలు ఇబ్బందులు పడ్డారు. కొంత సమయం తరువాత టెక్నికల్ సమస్య సరిదిద్ధడంతో యధావిధిగా పని చేయడంతో ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకున్నారు.

పలాస: బ్రహ్మణతర్లా, గోపాలపురం పోలింగ్ కేంద్రాల్లో ఇవిఎంలు మొరాయించడంతో అర్ధగంట ఆలస్యంగా ప్రారంభమైంది.

ఎచ్చెర్ల: మండలంలో ఫరీదుపేటలో 101, 102 పోలింగ్ బూత్‌ల్లో ఉదయం ఏడు గంటలకే ఇవిఎంలు మొరాయించడంతో ఓటర్లు ఇబ్బందులు పడుతూ క్యూలో నిల్చున్నారు. అరగంట తరువాత ఓటింగ్ ప్రారంభమైంది. భగీరథపురం 289 బూతులో మధ్యాహ్నం 11 గంటలకు సమయంలో 30 నిమిషాల పాటు ఇవిఎంలు మొరాయించాయి. ఫరీదుపేటలో 251 పోలింగ్ బూత్‌లో అరగంట పాటు ఇవిఎంలు మొరాయించాయి.

11 వరకు కొనసాగిన పోలింగ్

కంచిలి : బూరగాంలో 8 గంటల సమయంలో వేచి ఉన్న ఓటర్లు

ప్రజాశక్తి- పలాస

పలాస నియోజకవర్గంలో ఎన్నికల పోలింగ్ రాత్రి వరకు కొనసాగుతుంది. ఉదయం ఎండి వేడిమి కారణంగా సాయంత్రం 5 గంటల తరువాత ఓటర్లు రావడంతో రాత్రి 11 గంటల వరకు కొనసాగింది. రాత్రి 9 గంటల సమయానికి నియోజకవర్గం పరిధిలో 72 శాతం పోలింగ్ నమోదైందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి భరత్ నాయక్ తెలిపారు. రాత్రి 9 గంటలైనా ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పడిగాపులు కాస్తున్నారు.

రణస్థలం : జీరుపాలెం పోలింగ్ కేంద్రంలో రాత్రి 11 గంటల వరకు ఎన్నికల పోలింగ్ కొనసాగుతుంది. ఈ పోలింగ్ పరిధిలోని జీరుపాలెం, జగన్నాథపురం గ్రామాల్లో 1800 పైచిలుక ఓటర్లు ఉన్నారు. అందరూ మత్స్యకారులే. ఎక్కువ ఓటర్లు ఉండడంతో రాత్రి వరకు కొనసాగుతుంది. 2019 ఎన్నికల్లో రాత్రి 3 గంటల వరకు పోలింగ్ కొనసాగడం విశేషం.

నువ్వలరేవులో 7.30 గంటల వరకు

వజ్రపుకొత్తూరు: మండలంలోని నువ్వలరేవు పంచాయతీలో పోలింగ్ సోమవారం రాత్రి 7.30 గంటల వరకు కొనసాగింది. మండలంలోని పెద్ద గ్రామమైన నువ్వలరేవులో నాలుగు పోలింగ్ బూతులను ఏర్పాటు చేశారు. మొత్తం 4,122 ఓట్లు పోలయ్యాయి. సాయంకాలం ఆరు గంటల వరకు క్యూలో ఉన్నవారికి ఓటు వినియోగించుకునే అవకాశం కలిపించారు.

కంచిలి : మండలంలోని బురదపాడు, బూరగాం, కొల్లూరు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం ఆరు గంటలు దాటిన తరువాత కూడా పోలింగ్ కొనసాగింది. కొల్లూరు పోలింగ్ కేంద్రంలో ఆరున్నర వరకు, బూరగం గ్రామంలో ఎనిమిది గంటల వరకు పోలింగ్ జరిగింది. అలాగే బురదపాడు పోలింగ్ కేంద్రంలో రాత్రి 9 గంటల వరకు కొనసాగింది. కొల్లూరులో ఆరున్నర గంటల వరకు పోలింగ్ కొనసాగింది. వేసవి ఉష్ణోగ్రతల నేపథ్యంలో సాయంత్రం నాలుగు గంటలకు రావడంతో రాత్రి వరకు కొనసాగాయి.

కవిటి : వేచి ఉన్న వృద్ధులు

8 గంటల వరకు...

కవిటి : మండలం బల్లిపుట్టుగలో ఓటు వేసేందుకు వచ్చిన వృద్ధులు, కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఇక్కట్లకు గురవుతున్నారు. చాలా మందికి అవగాహన లేకపోవడం, పోలింగ్ ప్రక్రియ లేటుగా జరుగుతుండడంతో రాత్రి 8 గంటల దాటుతున్నా... ఇంకా ఓటు వేసేందుకు వృద్ధులు పోలింగ్ కేంద్రం వద్ద వేచి ఉన్నారు. గతంలో ఎప్పుడూ ఈ విధంగా లేదని, సరైన ఏర్పాట్లు చేయకపోవడమే పోలింగ్ ప్రక్రియ ఆలస్యం జరిగిందని ఓటర్లు ఆరోపిస్తున్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం లక్కివలస, కొల్లిపాడు పోలింగ్ కేంద్రాలకు సాయంత్రం ఓటర్ల తరలిరావడంతో రాత్రి 9 గంటల వరకు పోలింగ్ కొనసాగినట్లు అధికారులు తెలిపారు.

ఈ ఖరీఫ్‌కైనా నీరందేనా!

పోటాపోటీగా నేతలు హామీలు

పాతటెక్కలి వద్ద పూర్తిగా పొదలతో నిండిన వంశధార కాలువ

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

వంశధార శివారు గ్రామాల రైతులు పంట కోసం ఎదురుచూపులు ఎప్పుడూ తప్పడం లేదు. ప్రభుత్వాలు మారినా తమ పోలాలకు సాగునీరు అందడం లేదని రైతులు వాపోతున్నారు. పెట్టుబడి పెట్టడం... నీరులేక పంటలు ఎండిపోవడం కొన్నేళ్లుగా పరిపాటిగా మారిందని రైతన్నలు ఆవేదన చేందుతున్నారు. ఎన్నికల సమయం కావడంతో గ్రామాల్లోకి ప్రచారానికి వచ్చిన అభ్యర్థులు సాగునీరు అందిస్తామని హామీలు గుప్పించారు. రెండు పంటలకు సకాలంలో తాగునీరు అందిస్తామని అభ్యర్థులు ప్రసంగాలతో ఉదరకొట్టారు. మండలంలోని కొండావూరు, సీతపురం, బొడ్డపాడు, బెండి, గల్లి, శివరాంపురం, నగరంపల్లి, కిడిసింగు, పాతటెక్కలి, పొల్లాడ, దేవునక్తాడ వరకు సుమారు 25 కిలో మీటర్ల మేర వంశధార కాలువ చివరి భూములు ఉన్నాయి. ఆరు వేల ఎకరాల సాగు భూములకు సాగునీరు అందించే వంశధార కలువలు అధ్వానంగా తయారయ్యాయి. కొన్నేళ్లుగా మరమ్మతులకు నోచుకోకపోవడంతో కలువలు పూడుకతో పేరుకుపోయి పొదలు డొంకలు, ఆక్రమణలకు గురికావడంతో సాగునీరు ప్రశ్నార్థకంగా తయారైంది. దీంతో ఏటా పంటలు వేయడం, నీరు అందకపోవడం పరిపాటిగా మారింది. కణితివూరు నుంచి సీతంపేట మీదుగా ఉద్దానం గోపనాథపురం, ఉద్దానం మెళియాపుట్టి, పాతటెక్కలి, పొల్లాడ, దేవున్లతాడ వరకు, కణితివూరు నుంచి పి.వి.పురం, మర్లపాడు, యు.ఆర్.కె.పురం, కొండూరు మీదుగా తెరపల్లి మధ్య 60 ఆర్‌ఎల్ ,60 ఆర్‌ఎల్ 90 టిఇ కాలువలు ఉన్నాయి.

మర్లపాడు వద్ద కాలువ దుస్థితి

మధ్యలోనే పంటలు ఎండిపోతున్నాయి

ఏటా పంటలు మధ్యలోనే ఎండి పోతున్నాయి. పెట్టుబడి పెట్టీ రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల నాయకులు వచ్చి రెండు పంటలకు సాగునీరు అందిస్తామని హామీలు ఇస్తున్నారు. నెరవేరిస్తే మంచిది

- దట్టి దానయ్య, రైతు, మార్లపాడు

ఖరీఫ్‌కు నీరందించాలి

రానున్న ఖరీఫ్ సాగుకు నీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలి. రైతు సమస్యలను పరిష్కరించడానికి ప్రజాప్రతినిధులు చిత్త శుద్ధితో పనిచేయాలి. వర్షాభావ పరిస్థితుల వల్ల ఎప్పుడూ నష్టపోతున్నాం. పూడిక తీసి సిమెంట్ పనులు చేసి మదుములను మరమ్మతులు చేపట్టాలి.

- సిహెచ్.ధర్మారావు, రైతు, కొల్లిపాడు

ప్రశాంతంగా పోలింగ్

ఎచ్చెర్ల: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు క్యూలో నిలబడి తమ ఓటుహక్కును వినియోగించు కున్నారు. మధ్యాహ్నం 11 గంటల తరువాత ఎండ తీవ్రత ఉండటంతో మందకోడిగా సాగిన పోలింగ్ మధ్యాహ్నం మూడు గంటల నుంచి ఓటు వేసేందుకు ఓటర్లు బారులు తీరారు. ధర్మవరం గ్రామంలో ఎమ్మెల్యే కిరణ్ కుమార్ పోలీస్‌స్టేషన్ దగ్గర క్యూ కట్టిన ఓటర్లకు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని విజ్ఞప్తి చేస్తుండగా అక్కడున్న టిడిపి నేతలు ఇక్కడ ఓటు వేయమని ప్రచారం చేయడమేమిటని నిలదీశారు. ఎస్ఐ చిరంజీవి తన పోలీసులతో ఎమ్మెల్యేను అక్కడి నుంచి పంపించి పరిస్థితి చక్కదిద్దారు.

వేచి ఉన్న ప్రయాణికులు

ప్రయాణికుల పాట్లు

ప్రజాశక్తి- పలాస

సార్వత్రిక ఎన్నికలు నేపథ్యంలో ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. ఆర్‌టిసి, ప్రయివేటు బస్సులు ఎన్నికలకు వెళ్లిపోవడంతో ప్రయాణికులు వేరే చోటకు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నిరంతరం పలాస నుంచి విశాఖపట్నం, ఇచ్ఛాపురం వరకు నిరంతరం వందలాది బస్సులు రాకపోకలు సాగిస్తుండేవి. సోమవారం ఒక్కసారిగా బస్సులు లేకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. పలాస నుంచి మందస, హరిపురం, నందిగాం, మెళియా పుట్టి, గొప్పిలి తదితర ప్రాంతాల్లో సుమారు పది కిలోమీటర్ల ప్రయాణం చేయాలంటే ఆటో బుకింగ్ చేసుకున్నారు. ఇదే అదునుగా రూ.50 వసూలు చేసుకున్నట్లు సమాచారం. పలాస డిపో నుంచి పలాస 20, ఇచ్ఛాపురం 20, టెక్కలి 15, పాతపట్నం నియోజకవర్గాలకు 6 బస్సులు ఎన్నికలకు వెళ్లాయి. ఏదేమైనప్పటికీ ప్రయాణికులకు తిప్పలు తప్పలేదు.

బస్సుల్లో తరలివచ్చిన ఓటర్లు

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని అన్నాపురం, దిమ్మిడిజ్వాల, దీనబంధుపురం. నౌగాం, కర్లపూడి పోతులూరి గ్రామాలకు హైదరాబాద్ వంటి ప్రాంతాల్లోని సుమారు 500 మంది ఓటర్లు ఎనిమిది బస్సుల్లో సోమవారం మండలానికి చేరుకున్నారు. వారి బస్సు భోజన ఖర్చులన్ని ఆయా రాజకీయ పార్టీలు సామకూర్చడంతో వారు గ్రామాలకు వచ్చినట్లు తెలుస్తోంది. మండలంలోని పలు పోలింగ్ కేంద్రాల పరిధిలోని గ్రామాలకు చెందిన ఓటర్లు రెండు కిలోమీటర్ల దూరం ఉండడంతో ఆటోల్లో, ట్రాకర్లపై ఓటర్లు తరలివచ్చారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ మహమ్మద్ అమిర్ ఆలీ ఆధ్వర్యాన పటిష్ట బందోబస్తు ఏర్పాలు చేశారు.

కూలేందుకు సిద్ధంగా...

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని చిన్నతామరపల్లి వద్ద వంశధార ఎడమ ప్రధాన కాలువపై నిర్మించిన వంతెన కూలేందుకు సిద్ధంగా ఉంది. గతంలో కాలిబాట వంతెన ఉండేది. 1980లో ఆధునికీకరించి వంతెనను నిర్మించారు. చిన్నతామరపల్లి -కర్లపూడి గ్రామాలకు రహదారి సౌకర్యంగా ఉండేది. అయితే ప్రస్తుతం ఈ వంతెన ఏ క్షణానైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. దీంతో ప్రయాణి కులు, పాదచారులు భయాందోళనకు గురవు తున్నారు. అధికారులు స్పందించి నూతన వంతెన నిర్మించాలని కోరుతున్నారు.

కూలేందుకు సిద్ధంగా ఉన్న వంతెన

ప్రశాంతంగా సార్వత్రిక పోలింగ్

జి.సిగడాం : ఓటు వేయడానికి బారులు తీరిన ఓటర్లు

పొందూరు : కనిమెట్టలో బారులు తీరిన ఓటర్లు

కోటబొమ్మాళి : ఓటు హక్కు వినియోగించుకున్న వృద్ధ దంపతులు

ప్రజాశక్తి- కవిటి

సోమవారం జరిగిన సాధారణ ఎన్నికలు మండలంలో ప్రశాంతంగా ముగిశాయి. ఉదయం ఏడు గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు చేరుకుని తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఎమ్మెల్యే బెందాళం అశోక్ కవిటిలో తన ఓటు హక్కు వినియోగించుకోగా, ఎమ్మెల్సీ రామారావు లండారపుట్టుగలో తన ఓటు హక్కు వినియోగించుకున్నారు. ముఖ్యంగా మహిళలు, వృద్ధులు, వికలాంగులు పూర్తిస్థాయిలో తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి విజయ, ఎమ్మెల్సీ రామారావు, మాజీ ఎమ్మెల్యే సాయిరాజ్ పోలింగ్ సరళి పరిశీలించారు.

వజ్రపుకొత్తూరు : మండలంలోని దేవునల్తాడ పశు సంవర్థకశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు ఓటు హక్కు వినియోగించుకున్న అనంతరం పొలాడ, పాతటెక్కలి, పెద్దమురహరిపురం పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

కోటబొమ్మాళి: మండలంలోని నిమ్మాడలో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి కింజరాపు అచ్చెన్నాయుడు, ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడులు కుటుంబ సభ్యులతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అయితే పోలింగ్ కేంద్రాల వద్ద పూర్తిస్థాయిలో టెంట్లు వేయకపోవడంతో గంటల సమయం ఓటర్లు ఎండలో క్యూలో ఉండి నానా ఇబ్బందులు పడి ఓటు హక్కు వినియోగించుకున్నారు. మరోవైపు ఉక్కపోతల మధ్య ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ కేంద్రాలు వద్ద బారులు తీరిన ఓటర్లు నానా అవస్థలు పడ్డారు. మండలంలోని గురువెళ్లిపేటలో 101 ఏళ్ల వృద్ధుడు మెట్ట కృష్ణమూర్తి, 98 ఏళ్ల ఆయన భార్య మెట్ట మహాలక్ష్మిలు, వారి కుమారుడుతో కలిసి యలమంచిలిలో ఓటు హక్కును వినియోగించుకున్నారు.

జి.సిగడాం: మండలంలో ప్రశాంతంగా చాలాచోట్ల పోలింగ్ జరిగింది. కొన్ని ప్రాంతాల్లో గొడవలు జరిగినా మిగతా అన్ని ప్రాంతాల్లో పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. మండలంలో సుమారుగా 67శాతం ఓటింగ్ పోలైనట్టు అధికారులు తెలిపారు. ఉదయం ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో ఓటర్లకు ఇబ్బంది లేకుండా బిఎల్‌ఒలు టెంట్లు, తాగునీరు సదుపాయం కల్పించారు. నిద్దం పోలింగ్ కేంద్రంలో మాక్‌పోల్ తొలగించకుండా ఓటింగ్ ప్రక్రియను ప్రారంభించిన పోలింగ్ ఆఫీసర్ పోలింగ్ అయిపోయిన కొంత సమయం తర్వాత ఏజెంట్లను, పోలింగ్ అధికారులను, పోలీసుల సమక్షంలో డమ్మీ ఓట్లను తొలగించారు. కొన్ని పోలింగ్ కేంద్రాల్లో మధ్యాహ్నం రెండు గంటలకే పోలింగ్ ముగిసిపోయింది.

పొందూరు: మండలంలో జరిగిన సార్వత్రిక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల కొట్లాటలు, తోపు లాటలు, వివాదాలు నడుమ ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయి. ఉదయం 7గంటలకే పోలింగ్ ప్రారంభం కావాల్సి ఉండగా, పలుచోట్ల సిబ్బంది కారణంగా నెమ్మదిగా ప్రారంభ మయ్యాయి. అలాగే ఇవిఎంలు మొరాయించాయి. బుడిరికంచరాంలో 155 పోలింగ్ కేంద్రంలో సుమారు గంట ఆలస్యంగా పోలింగ్ ప్రారంభం అయింది. ఉదయం 7గంటలకే పోలింగ్ కేంద్రాలు వద్ద ఓటర్లు బారులు తీరారు. తరువాత ఎండ కారణంగా పోలింగ్ తగ్గగా మూడు గంటలు తరువాత మరలా ఓటర్లుతో పోలింగ్ కేంద్రాలు కిటకిటలాడాయి. వృద్ధులను, వికలాంగులను ఇరుపార్టీలు వారు ప్రత్యేక వాహనాలు ద్వారా పోలింగ్ కేంద్రాలకు తరలించారు. పలు పోలింగ్ కేంద్రాల్లో సాయంత్రం 6 గంటల తరువాత కూడా ఓటర్లు బారులు తీరడంతో సమయం ముగిసినప్పటికీ పోలింగ్‌ను సిబ్బంది కొనసాగించాల్సి వచ్చింది.

రణస్థలం: మండలంలోని సోమవారం జరిగిన సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 7 గంటల నుంచి ఓటర్లు పోటెత్తారు. అలాగే వలస ఓటర్లు కూడా ఈ ఎన్నికల్లో పాల్గొన్నారు. ముఖ్యంగా మహిళా ఓటర్లు ఎక్కువ శాతం పాల్గొన్నారు. మత్స్యకార గ్రామాల్లో మహిళలు ఇవిఎంలో ఓటు వేయడానికి తడబడ్డారు. పోలింగ్ కేంద్రాలవద్ద ఒక్క పోలీసు కానిస్టేబుల్‌ని నియమించడంతో పోటెత్తిన ఓటర్లను నియంత్రించడంలో చాలా కష్టపడ్డారు. నగరప్పాలెంలో అరగంట సేపు ఇవిఎం మొరాయించింది. అలాగే జీరుపాలేం, జె.ఆర్.పురం పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లు బారులు తీరారు. ఈ ఎన్నికల్లో ఓటుహక్కు పొందిన యువతీ యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తాగేందుకు నీరు, మెడికల్ క్యాంపు ఏర్పాటు, వికలాంగులను పోలింగ్ కేంద్రాల వద్దకు తీసుకుని వచ్చేందుకు వీల్ చైర్లు ఏర్పాటు చేసారు. అలాగే కోష్ట పోలింగ్ కేంద్రాన్ని మెడల్ పోలింగ్ కేంద్రంగా ఏర్పాటు చేసి మామిడి తోరణాలు, ప్లెక్సీలు ఏర్పాటు, గర్భిణీ స్త్రీలు విశ్రాంతి గదులు, బాలింతలు పిల్లలను తీసుకుని వచ్చి ఓటువేసి వచ్చేలోపు అడుకునేందుకు ఆటవస్తువులు ఏర్పాటు చేశారు.

పలాస : సార్వత్రిక ఎన్నికలు స్వల్ప ఘర్షణ సంఘటన మినహా ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. నియోజక వర్గానికి సంబంధించిన 284 పోలింగ్ కేంద్రాల్లో 2,18.208 ఓట్లకు గాను, పలాస-కాశీబుగ్గ మున్సిపాల్టీ, పలాస, మందస, వజ్రపుకొత్తూరు మండలాల్లోని ఓటర్లు ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ బూతుల వద్దకు ఓటర్లు చేరుకున్నారు.

వజ్రపుకొత్తూరు మండలం దేవునల్తాడలో మంత్రి అప్పలరాజు, టిడిపి అభ్యర్థి గౌతు శిరిషా పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ సందర్భంగా ఎక్కడా, ఎటువంటి సంఘటనలు జరగకుండా కాశీబుగ్గ డిఎస్‌పిలు, సిఐలు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. సాయి కాలనీ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ఇవిఎంలు మొరాయించడంతో మందకోడిగా సాగింది.

మెళియాపుట్టి : మండలంలోని మైదాన, మారుమూల గిరిజన ప్రాంతాలైన కేరాసింగి, పడ్డ, వెంకటాపురం తదితర కొండ ప్రాంతాల్లో సైతం గిరిజనులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే దూరపు ప్రాంతాల్లో ఉన్న హైదరాబాద్, చెన్నయ్, విజయవాడ వలస వెళ్లిన ఓటర్లు వాహనాలపై వచ్చి ఓటుహక్కు వినియో గించుకున్నారు.

వజ్రపుకొత్తూరు: మండలంలోని ఒకటి రెండు చోట్ల మినాహా అన్ని కేంద్రాల వద్ద నిర్వహించిన పోలింగ్ ప్రశాంతంగా సాగింది. వృద్ధులు, వికలాంగులు కుటుంబ సభ్యులు వీల్‌చైర్లలో తరలించారు. సుంకర జగన్నాథపురం పోలింగ్ కేంద్రంలో తొలిసారి తమ ఓటు హక్కును వినియోగించుకున్నామని యువకులు ఉత్సాహం చూపారు. గుణాలపాడు బూత్ వద్ద స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. పక్క గ్రామం నుంచి టిడిపి నాయకులు వచ్చి అలజడి సృష్టించారని సర్ధిచెప్పే క్రమంలో తన చొక్కా పట్టుకుని లాగడంతో జోబి చిరిగి అందులోని రూ.ఐదు వేలు నగదు, మొబైల్ ఫోన్ పోయాయని బాధితుడు పాపారావు పోలీసుల ముందు వాపోయారు. సిఐ లక్ష్మి ఈ విషయంపై పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పోలాకి : మండలంలోని మబగాంలో ఎమ్మెల్యే అభ్యర్థి ధర్మాన కృష్ణదాస్, జలుమూరు మండలం మర్రిపాడులో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి బగ్గు రమణమూర్తిలు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. నియోజకవర్గంలో పోలీసులు పకడ్బందీగా బందోబస్తు ఏర్పాటు చేశారు. మొత్తం డిఎస్‌పి త్రినాథరావు, నాలుగురు సిఐలు, ఎనిమిది మంది ఎఎస్‌ఐలు, 400 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు. 7.55 గంటలకు 77.81 శాతం పోలింగ్ నమోదైందని అధికారులు తెలిపారు.

టెక్కలి రూరల్ : మండలంలోని ఉదయం 7 గంటల నుంచే గ్రామీణ ప్రాంతాల ఓటర్లు బారులుతీరారు. అయితే ఇవిఎంల సాంకేతికంగా ఇబ్బందులతో ఓటింగ్ మొదటి రెండు గంటలు నత్తనడకన సాగింది. ఆ తరువాత ఓటింగ్ ప్రక్రియ పుంజుకుంది. పోలింగ్ కేంద్రాల్లో వికలాంగులు, వృద్ధులు వీల్‌చైర్లను వినియోగించుకున్నారు. మండలంలోని నర్సింగపల్లి మోడల్ పోలింగ్ స్టేషన్ వద్ద పలువురు గిరిజన విద్యార్థులు నృత్య ప్రదర్శనలు చేయడంతో అందరినీ ఆకట్టుకుంది. భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వం ఉన్నత పాఠశాలలో వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కిల్లి కృపారాణి ఓటు హక్కు వినియోగించుకున్నారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలంలో చిన్నపాటి తోపు లాట్లు మినహా ప్రశాంతంగా పోలింగ్ జరిగింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రతకు మందకొడిగా సాగింది. సాయంత్రం ఓటర్లు ఒక్కసారిగా బారులు తీరారు. పలు కేంద్రాల్లో టెంట్లు వేసినా ఓటర్లు బార్లు తీయడంతో పలు ఇబ్బందులు పడ్డారు. టెక్కలి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ పరిశీలించారు.

లావేరు : మండలంలోని అదపాక పోలింగ్ కేంద్రాన్ని విజయనగరం ఎంపీ బెల్లన చంద్రశేఖర్ పరిశీలించారు. లావేరులో పలువురు వృద్ధులను విల్ చక్రాల్లో తీసుకొచ్చి ఓట్లు వేయించారు. లావేరు 78 పోలింగ్ కేంద్రాన్ని మోడల్ కేంద్రంగా ముస్తాబు చేశారు. ఇక్కడ ఓట్లు వేయడానికి వెళ్లి, రావడానికి ద్వారం కావడంతో ఓటర్లు బారులుతీరారు.

రణస్థలం : బారులు తీరిన ఓటర్లు

లావేరు: పోలింగ్ కేంద్రం వద్ద ఎంపీ బెల్లన చంద్రశేఖర్

దుస్తులు అందజేస్తున్న గిరిజా మహాలక్ష్మి

వృద్ధులకు దుస్తులు అందజేత

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మాతృ దినోత్సవం సందర్భంగా నగరంలోని బొందిలీపురం వద్ద ఖ్యాతి వృద్ధాశ్రమంలో సిక్కోలు స్వచ్ఛంద సేవాసమితి సభ్యులు ఫలాలు, స్నాక్స్, బట్టలు, భోజనం అందజేశారు. అలాగే రాత్రి పూట ఇబ్బందులు పడుతున్నారని తెలుసుకుని వృద్ధాశ్రమానికి రెండు సీలింగ్ ఫ్యాన్‌లను అందజేశారు. సోమవారం సంస్థ సభ్యులు రిమ్స్ ఆస్పత్రిలో స్టాఫ్‌నర్స్‌గా సేవలందిస్తున్న గిరిజా మహాలక్ష్మి హాజరై వీటిని అందజేశారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమం నిర్వహకురాలు డాక్టర్ శ్రావణి పాల్గొన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు దుర్గమ్మ, అవినాష్, జగదీష్, నవీన్, భాస్కర్, రాజుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగ పంపిణీ చేస్తున్న డాక్టర్ రాజేష్‌బాబు

మజ్జిగ పంపిణీ

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

నగరంలోని ఇల్లిసిపురం మెయిన్‌రోడ్డులో సూర్య డెంటల్ వైద్యాశాల ఆధ్వర్యాన ప్రధాన కూడళ్లలో మజ్జిగ పంపిణీ చేశారు. డెంటల్ వైద్యులు డాక్టర్ చౌదరి రాజేష్ బాబు హాజరై పంపిణీ చేశారు. సోమవారం వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని నగరానికి వివిధ అవసరాల రీత్యా వచ్చే వారికి దాహార్తిని తీర్చడానికి జిల్ ఫౌండేషన్ సహకారంతో మజ్జిగ పంపిణీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని మధ్యాహ్నం సమయంలో బయటకు రావద్దని సూచించారు. ప్రధానంగా వృద్ధులు, రోగులు వేసవి ఉష్ణోగ్రతల వల్ల ఇబ్బందులు పడుతున్నారని, అటువంటి వారికి సకాలంలో తాగునీరు అధికంగా తీసుకోవడం, మితమైన ఆహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలన్నారు. ఎక్కువగా మజ్జిగ తీసుకోవడం వల్ల శరీర ఉష్ణోగ్రతల్లో మార్పు వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్ ఫౌండేషన్ అధ్యక్షులు జాడ సాయి, శివతేజ, శ్రీ సూర్య డెంటల్ వైద్యాశాల సిబ్బంది, జిల్ సభ్యులు అఖిల్ వర్మ, వెంకటరావు పాల్గొన్నారు.

పరిశీలిస్తున్న గంగాధర్

పటిష్ట బందోబస్తు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అన్ని రకాల చర్యలు తీసుకుని గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎన్నికల అదనపు ఎస్‌పి గంగాధర్ అన్నారు. ఇచ్ఛాపురం జరుగుతున్న పోలింగ్ తీరును సోమవారం పరిశీలించారు. ఇక్కడా ఎటువంటి ఘర్షణ వాతావరణం లేకుండా కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈయనతో పాటు సిఐ టి.ఇమ్మాన్యువల్‌రాజు, ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కంట్రోల్‌రూమ్‌లో నిఘా

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్‌రూమ్

కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూంను పోలింగ్ రోజు పర్యవేక్షణ కోసం 600 మంది సిబ్బందితో ఏర్పాటు చేశారు. కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెల్ నుంచి వెబ్ కాస్టింగ్ ద్వారా ఓటింగ్ సరళిని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మనజీర్ జిలానీ సమూన్ పర్యవేక్షించారు. ఉదయం 5 గంటలకే కంట్రోల్ రూంకు చేరుకున్న ఆయన వెంటనే ఆయా పోలింగ్ కేంద్రాల్లో మాక్ పోలింగ్ జరుగుతున్న తీరును గమనించారు. ఒకటి, రెండు చోట్ల ఇవిఎంల్లో సాంకేతిక లోపాలను తెలుసుకుని 15 నిమిషాల్లోనే కొత్త వాటిని అక్కడ ఏర్పాటు చేయించారు. పోలింగ్ ఉదయం ఏడు గంటలకే ప్రారంభం అయ్యేలా, ఎక్కడా ఐదు నిమిషాలు కూడా ఆలస్యం అవ్వకూడదని ఆయన చేసిన ప్రయత్నం సత్ఫలిచ్చింది. రోజంతా ఎక్కడా ఇవిఎంల్లో సాంకేతిక లోపం అనే పదమే లేకుండా పకడ్బందీగా ఎన్నికల నిర్వహించడంలో ఆయన మార్క్ స్పష్టంగా కనిపించింది.

పోల్ డే మానిటరింగ్ సిస్టం (పోలింగ్ రోజున నిర్వహించాల్సిన పనులు) కోసం ఆయన ముందుగా ఏర్పాటు చేసిన నోడల్ అధికారులంతా వారి వారి విధుల్లో క్రియాశీలకంగా పని చేస్తుండటంతో ఎక్కడ లోటుపాట్లు జరిగినా, చిన్న పాటి పొరపాట్లు తలెత్తినా కమాండ్ కంట్రోల్ రూమ్‌కి సమాచారం ఇట్టే చేరిపోయేది. చివరకు చెదురు, మదురు ఘటనలను సైతం ఆయన సీరియస్‌గా తీసుకున్నారు. సెక్టార్ అధికారులను, పోలీసు సిబ్బందిని అప్రమత్తం చేస్తూ కనిపించారు. పొందూరు మండలంలో జరిగిన చిన్నపాటి ఘర్షణ విషయాన్ని అధికారుల కంటే ముందే ఆయనే నేరుగా సమాచారం తెప్పించుకుని సిబ్బందికి సూచనలు ఇవ్వడంతో అధికారులు మరింత అప్రమత్తంగా పనిచేసేలా చేసింది. వెబ్ క్యాస్టింగ్‌లో పోలింగ్ కేంద్రంలో ఎవరైనా సెల్‌ఫోన్‌తో ప్రవేశించినా, అనుమానాస్పదంగా కనిపించినా, క్యూలైన్ల నిర్వహణ సరిగ్గా లేకపోయినా, స్క్రీన్ మీద చూసిన వెంటనే పోలింగ్ స్టేషన్ నెంబర్ నమోదు చేసుకుని నేరుగా ఆర్‌ఒలతో మాట్లాడుతూ సూచనలిస్తూ అప్రమత్తం చేస్తూ కనిపించారు.

క్యూలైన్ల నిర్వహణ సైతం పోలింగ్ స్టేషన్ల వారీగా పరిశీలిస్తూ ఎక్కడ గందరగోళ పరిస్థితులు తలెత్తకుండా చొరవ తీసుకోగలిగారు. సోషల్‌మీడియా, ఎలక్ట్రానిక్ మీడియాలో వస్తున్న వార్తల వివరాలను, ట్రోలింగ్‌లను గుర్తించి ఎంసిఎంసిలు కమిటీలను అప్రమత్తం చేశారు. కంట్రోల్ రూమ్ వెలుపల ఏర్పాటు చేసిన పోలింగ్ శాతాన్ని, ఇతర సమాచారం తెలుసుకునే సిబ్బంది దగ్గరకి ప్రతి అరగంటకు తానే స్వయంగా బయటకు వెళ్తూ సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఓటర్ హెల్ప్‌లైన్ కోసం నిర్దేశించిన 1950కి వస్తున్న ఫిర్యాదులను ప్రతి గంటకూ నివేదిక రూపంలో తెప్పించుకుని 100 శాతం ఓటరుకు సహాయపడేలా సూచనలు జారీ చేశారు. సెక్టార్ అధికారుల వాహనాలు ఏ మార్గంలో ప్రయాణిస్తున్నది జిపిఎస్ ద్వారా తెలుసుకొని, సమయానుకూలంగా సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వైపు వాటిని పంపిస్తూ పదేపదే ఫోన్‌లో క్షణం తీరిక లేకుండా మాట్లాడుతూ కనిపించారు. ఎన్నికలను ప్రశాంతంగా ముగించడంలో జిల్లా ఎన్నికల అధికారిగా కలెక్టర్ సఫలమయ్యారు.

పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పోలింగ్ కేంద్రాలు పరిశీలన

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లా వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల పోలింగ్ కేంద్రాలను జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఆకస్మికంగా సోమవారం పరిశీలించారు. ఆయా కేంద్రాల్లో మౌలిక వసతులపై ఆరా తీశారు. ఓటర్లకు మంచినీటి సౌకర్యంపై ఆరా తీశారు. పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల సరళిని ప్రత్యేకంగా సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆయనతో పాటు పలువురు అధికారులు ఉన్నారు. నగరంలోని టిపిఎం స్కూల్ ఆవరణలో పోలింగ్ స్థితిగతులపై జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ తనిఖీ చేశారు. ఈ మేరకు కలెక్టర్‌ను సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ శ్రీనివాస పట్నాయక్ కలిశారు.

సిరా చుక్క చూపిస్తున్న కళావెంకటరావు

పోటీ అక్కడ.. ఓటు ఇక్కడ

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సీనియర్ నేత కిమిడి కళా వెంకటరావు అనూహ్యంగా విజయనగరం జిల్లాలోని చీపురుపల్లి అసెంబ్లీ నియోజకర్గంలో టిడిపి అభ్యర్థిగా పోటీ చేయాల్సి వచ్చింది. చీపురుపల్లి నియోజకవర్గం తన సొంత నియోజకవర్గం రాజాంకు తాను ఇప్పటివరకు నాయకత్వం వహించిన ఎచ్చెర్ల నియోజకవర్గానికి మధ్యస్తంగా ఉంటుంది. 2009 నుంచి కళా వెంకటరావుకు ఎచ్చెర్లలోనే ఓటు ఉండగా, 2024లో చీపురుపల్లి ఎమ్మెల్యేగా పోటీలో నిలిచారు. ఇప్పటివరకు మూడు సార్వత్రిక ఎన్నికలతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఓటుహక్కు వినియోగించుకుంటున్న కళా వెంకటరావు చీపురుపల్లి నియోజకవర్గంలో బరిలో ఉన్నప్పటికీ ఎచ్చెర్ల నియోజకవర్గానికి వచ్చి ఓటు వేయడం గమనార్హం.

నిర్మానుష్యంగా శ్రీకాకుళం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వరుసగా మూడు, నాలుగు రోజులు సెలవులు వస్తే తప్ప శ్రీకాకుళం నగరం నిర్మానుష్యంగా మారదు. పండగ, దసరా వంటి పర్వదినాలు మినహా రోడ్లు ఖాళీగా ఉండవు. నిత్యం వాహనాల రాకపోకలు, జనం సందడిగా కనిపించే శ్రీకాకుళం ప్రధాన రహదారులన్నీ సోమవారం బోసిపోయాయి. రోడ్డుపై జనాలు తిరిగే పరిస్థితి కనిపించలేదు. 2024 అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ తరహాలో నగరం నిర్మానుష్యంగా మారింది. రోడ్లు అన్నీ ఖాళీగా ఉండడమే కాకుండా దుకాణాలు, హోటళ్లు మూత పడ్డాయి. నగరంలోని వివిధ పోలింగ్ కేంద్రాల వద్ద ప్రధాన పార్టీల అభ్యర్థుల తరపున శిబిరాలు నిర్వహించే దగ్గర జనం గుమిగూడి కనిపించారు. అంతకుమించి బయట జనం కనిపించక పోవడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి.

నిర్మానుష్యంగా మారిన నగర రోడ్లు

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన డిఐజి

పిఎస్‌ఎన్‌ఎం స్కూల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డిఐజి విశాల్ గున్ని

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం జరిగిన పోలింగ్ నిర్వహణను విశాఖ రేంజ్ డిఐజి విశాల్ గున్ని సోమవారం పరిశీలించారు. నగరంలోని పిఎస్‌ఎన్‌ఎం స్కూల్‌లో ఉన్న పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఆయన ఓటర్లతో మాట్లాడారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. కవ్వింపు చర్యలకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. ప్రతిఒక్కరు తమ ఓటుహక్కును ప్రశాంత వాతావరణంలో వినియోగించుకునేందుకు వీలుందన్నారు. జిల్లాలో అవాంచనీయ ఘటనలకు తావు లేకుండా ఎన్నికలు జరుగుతున్నట్లు తెలిపారు. సమస్యాత్మక ప్రాంతాల్లో సైతం ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించు కుంటున్నట్లు తెలిపారు.

ఆమదాలవలస: పురపాలక సంఘ పరిధిలోని జూనియర్ కాలేజ్ కృష్ణాపురం, మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కొర్లకోట, బొబ్బిలిపేట గ్రామాల్లో డిఐజి విశాల్ గున్ని పలు పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి పలు సూచనలు, సలహాలు అందించారు. ఎస్ఐ కె.వెంకటేష్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

టిడిపి అభ్యర్థిని అడ్డగించిన వైసిపి నేతలు

- రోడ్డుపై బైఠాయించిన శంకర్
- పోలీసుల చొరవతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి- శ్రీకాకుళం రూరల్

మండలంలో ఇప్పిలి గ్రామంలో వైసిపికి అనుకూలంగా ఏకపక్షంగా ఓటింగ్ జరుగుతున్నట్టు తెలియడంతో టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్ ఇప్పిలి పంచాయితీ పరిధిలో పోలింగ్ సరళిని పరిశీలిం చేందుకు వెళ్తుండడంతో వైసిపి కార్యకర్తలు అడ్డగించారు. గ్రామంలోకి వెళ్ళనీయకుండా వాహనాన్ని అడ్డుకున్నారు. దీంతో శంకర్ వర్గీయులు వారికి సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో శంకర్ వారి తీరును నిరసిస్తూ రోడ్డుపై బైఠాయించారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని చక్కదిద్దారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ వైసిపి ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసి రౌడీయిజం చేస్తుందని, పోలింగ్ రోజున పోటీలో ఉన్న ప్రధాన ప్రతిపక్ష అభ్యర్థిని అడ్డుకోవడం సిగ్గుచేటన్నారు. వైసిపి అరాచక పాలనకు మరెన్నో రోజులు గడువు లేదన్నారు. పోలీసులు సైతం వైసిపికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారని ఆయన ఆరోపించారు. సిఐ సన్యాసినాయుడు అక్కడకు చేరుకుని నచ్చజెప్పడంతో వివాదం సద్దు మణిగింది.

రోడ్డుపై బైఠాయించిన శంకర్

ఖండాలు దాటి వచ్చినా నిరాశ తప్పలేదు

ప్రజాశక్తి- నౌపడ

సంతబొమ్మాళి మండలం యాములపేట పంచాయతీకి చెందిన లొట్ల రాము ఓటు వేసేందుకు ఖండాలు దాటి ఒమన్ దేశం నుంచి వచ్చినా ఓటు హక్కు వినియోగించు కోలేక తీవ్ర నిరాశకు గురయ్యాడు. వివరాల్లోకి వెళ్తే... రాము గత కొన్నేళ్లుగా పవన్ దేశంలో సివిల్ పనులు చేసుకునేందుకు వలస వెళ్లాడు. రాష్ట్రంలో సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తన ఓటు హక్కు వినియోగించుకొని నచ్చిన నాయకుని ఎన్నుకోవాలని ఉద్దేశంతో రాను పోనూ రూ.60 వేలు ఖర్చుతో టిక్కెట్లు బుక్ చేసుకున్నాడు. అయితే యామలపేటలోని పోలింగ్ బూత్ వద్ద ఓటు వేసేందుకు వెళ్లిన రాముకు పోలింగ్ అధికారులు ఓటర్ జాబితాలో పేరు లేదని చెప్పడంతో ఒకసారిగా షాక్‌కు గురయ్యాడు. తన వద్ద ఓటు కార్డు చూపించినా అధికారులు అనుమతించలేదు. దీంతో ఛాలెంజింగ్ ఓటు కూడా వేసేందుకు అనుమతి లేకపోవడంతో చేసేదేమీ లేక తన ఓటు వేసే అవకాశం కోల్పోయాడు. ఓటర్ జాబితాలో లోపాలను సరిచేయడంలో అధికారులు విఫలమైనందున ఓటు హక్కును వినియోగించుకోలేక పోయానని రాము ఆవేదన వ్యక్తం చేశారు.

ఓటు హక్కు కార్డు చూపిస్తున్న రాము

గిరివానిపాలెంలో గందరగోళం

- ఎన్‌డిఎ కూటమికి ఓట్లు వేయించారని పిఒపై వైసిపి ఫిర్యాదు
- రీపోలింగ్ చేపట్టాలని డిమాండ్

ప్రజాశక్తి- రణస్థలం

తిరుపతిరావు

మండలం లోని గిరివాని పాలెం 142 పోలింగ్ కేంద్రంలో జరిగిన సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. వృద్ధులు, ఓటు వేయడం రానివారు, వికలాంగులు ఓట్లు పోలింగ్ అధికారి ఎస్. తిరుపతిరావు దగ్గరుండి వేయించారు. అదే క్రమంలో ఒక అమ్మాయి తన తండ్రిని ఓటు వేయించడానికి పోలింగ్ కేంద్రానికి తీసుకుని వచ్చి మానాన్న ఓటు వెయ్యలేరని ఓటు వేయించమని పిఒని కోరింది. పిఒ ఆయనను ఓటు వేయించడానికి బూత్‌లోకి తీసుకుని వెళ్లారు. ఆయన ఫ్యాను గుర్తుపై వేయమంటే అసెంబ్లీ స్థానానికి కలువపువ్వు గుర్తుపై, ఎంపీ స్థానానికి సైకిల్ గుర్తుపై వేయించారని అమ్మాయి బైటకు వచ్చి వైసిపి నాయకులకు చెప్పడంతో వారంతా పోలింగ్ నిలుపుదల చేసి ఆందోళన చేపట్టారు. తక్షణమే తహశీల్దార్ రామారావు పోలింగ్ కేంద్రానికి వచ్చి అందరికీ సర్ధిచెప్పి పోలింగ్ కొనసాగించారు. పోలింగ్ అధికారి ఎస్. తిరుపతిరావును తహశీల్దార్ కార్యాలయానికి తీసుకుని వెళ్లిపోయారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు, వైసిపి ఏజెంట్లు మాట్లాడుతూ పిఒను తక్షణమే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్నం 2 గంటల సమయానికి మొత్తం ఓట్లు 453 ఓట్లు పోలయ్యాయని అందులో వృద్ధులు, వికలాంగులు ఓట్లు 50 పైచిలుకు పిఒ వేసినట్లు ఆరోపణ చేశారు. ఇక్కడ మళ్లీ రీ పోలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. సిసి ఫుటేజ్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని తహశీల్దార్ హామీఇవ్వడంతో వైసిపి నాయకులు శాంతించారు.